సాక్షి పల్నాడు

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్దఎత్తున వచ్చారు. కర్నూలు, జమ్మలమడుగు, నంద్యాల, ధర్మవరం ప్రాంతాల నుంచి తరలివచ్చారు.



సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి

గురజాల : సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు ఆదివారం తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాది కలివెల ప్రభుదాసు, జైలు సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి ఉన్నారు.

బండ్లమ్మకు పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు పొన్నూరుకు సీఎం వైఎస్ జగన్



పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం పొన్నూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగిస్తారు. పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ సభ జరిగే ప్రదేశం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులు, నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాల్గొనే బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ పర్యటనలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. భద్రతా ఏర్పాట్లను ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు రమేష్, పోతురాజు, శాంతకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు షేక్ నాజర్, వజ్రాణం ప్రసాద్, దాసరి నారాయణరావు, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళం



నరసరావుపేటరూరల్: ఇస్సపాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఇరుకుపాలెం గ్రామానికి చెందిన వెంపాటి శ్రీనివాసరావు, రమాదేవి, వెంకట లింగేశ్వరరావు, కిరణ్మయి దంపతులు రూ.2,50,000 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం చెక్కును ఈఓ టి.సుధాకరరెడ్డికి దాతలు అందించారు. ఆలయ పునర్నిర్మాణం వేగంగా జరుగుతుందని, దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు.

మసీదుల్లో టీడీపీ ప్రచారంపై లీగల్ సెల్ ఫిర్యాదు



నరసరావుపేట: మసీదుల్లో కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి, డీఆర్వో కె.వినాయకంకు ఫిర్యాదు అందజేశారు. టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు కొంతమంది కార్యకర్తలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన చేస్తూ నియోజకవర్గంలో ఉన్న మసీదుల్లో పాంప్లెట్లు, బుక్స్ పంచుతూ టీడీపీకి ఓటు వేయమని ప్రలోభ పెడుతూ ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోమని ఆధారాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులైన కాకుమాను బాల హనుమంతరెడ్డి, ఆరెకూటి శ్రీనివాసరెడ్డి, యర్రంరెడ్డి సీతారామరెడ్డి, ఎండి షరీఫ్ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 505.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.30 అడుగుల వద్ద ఉంది.







ప్రచార పర్వం

పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల నియోజకవర్గాలలో ఆదివారం ఆయా అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. రొంపిచర్ల మండలం మాచవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. చిలకలూరిపేట పట్టణంలోని 11వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు ప్రచారం నిర్వహించారు. ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు. దుర్గి మండలం అడిగొప్పలలో మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాతృమూర్తి రాములమ్మ, సోదరి జవ్వాజి నాగమణి ప్రచారం నిర్వహించారు.

బరిలో నిలిచేదెవరో?

- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు
- సత్తెనపల్లిలో కూటమి రెబల్ అభ్యర్థిగా బొర్రా వెంకటఅప్పారావు
- డీల్ కుదిరింది? పోటీ నుంచి తప్పుకుంటాడు అంటున్న కన్నా వర్గం



డమ్మీ ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌పై ఉన్నగుర్తులు

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగియనుంది. సాయంత్రం 5 గంటలకు జిల్లా ఎన్నికల అధికారులు ఉపసంహరణ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో పోటీలో నిలిచేదెవరో అనే ప్రశ్న జిల్లా వాసుల్లో వినిపిస్తోంది. స్వతంత్ర అభ్యర్థుల గుర్తులు కూడా ఖరారుకానున్నాయి. సత్తెనపల్లి అసెంబ్లీ స్థానం నుంచి కూటమి రెబల్ అభ్యర్థిగా జనసేన పార్టీకి రాజీనామా చేసిన బొర్రా వెంకట అప్పారావు పోటీ చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు ఆందోళన నెలకొంది. బొర్రా అప్పారావుతో డీల్ కుదిరిందని, సోమవారం పోటీ నుంచి తప్పుకుంటున్నాడని కన్నా వర్గం నేతలు చెబుతున్నారు. మరోవైపు మేము పోటీలో ఉంటున్నామని, బొర్రా అప్పారావును డబ్బులతో కొన్నామని టీడీపీ నేతలు చెప్పడం సరైంది కాదని ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొర్రా పోటీలో ఉంటాడా, తప్పుకుంటాడా అనేది మధ్యాహ్నం 3 గంటలలోపు తెలియనుంది.

రెండు బ్యాలెట్‌లు ఉంటాయా..?

సాధారణంగా ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో 16 గుర్తులకు బటన్లు ఉంటాయి. ఒకటి నోటాకు కేటాయించగా మిగిలిన 15 మందికి గుర్తులు కేటాయించే అవకాశం ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 15 మంది కన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే రెండో ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. జిల్లాలో నామినేషన్ల పరిశీలన తరువాత పెదకూరపాడులో 11 మంది, మాచర్లలో 15మంది, గురజాలలో 13 మంది అభ్యర్థులు తేలారు. ఈ నియోజకవర్గాలలో ఒక్క బ్యాలెట్ యూనిట్‌తోనే ఎన్నికలు నిర్వహించవచ్చు. మిగిలిన నాలుగు అసెంబ్లీల్లో ఇప్పటికైతే 15 మంది కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నరసరావుపేటలో 16 మంది, సత్తెనపల్లిలో 20 మంది, వినుకొండలో 16 మంది, చిలకలూరిపేటలో 26 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. ఉపసంహరణ గడువు ముగిసేలోగా బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 15కు మించితే ఈ స్థానాలలో రెండో యూనిట్ వినియోగించాల్సి ఉంటుంది. పార్లమెంట్ స్థానంలో 27మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో 19మంది నామినేషన్లు ఆమోదం పొందాయి.

బ్యాలెట్ యూనిట్లు సిద్ధం

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకు ఎన్నికల సంఘం 5,562 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉంచింది. జిల్లాలో 1,926 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ బూత్‌లో అసెంబ్లీ ఒకటి, పార్లమెంట్‌కి ఒక బ్యాలెట్ యూనిట్ అవసరమవుతుంది. మొత్తం 3,852 ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతాయి. మరో 1,710 ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ ఉపసంహరణ తర్వాత మరిన్ని ఈవీఎంలు అవసరమైతే రాష్ట్ర ఎన్నికల సంఘం సరఫరా చేయనుంది.

వ్యయ పరిశీలకుల నియామకం

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా సుమీత్ కుమార్ నియమితులయ్యారు. వారు ఎన్నికలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 91546 90389 నంబరులో అందుబాటులో ఉంటారు.

- నరసరావుపేట, వినుకొండ, గురజాల, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా నియమితులైన జార్జ్ జోసెఫ్ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 91546 30396 నంబరులో అందుబాటులో ఉంటారు.
- పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా నియమితులైన ఆర్.గౌతమన్ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 91546 90398 నంబరులో అందుబాటులో ఉంటారు.
- పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన భూరే సర్వేశ్వర్ నరేంద్ర ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9154690367 నంబర్‌లో అందుబాటులో ఉంటారు.
- చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన శ్రీహరి ప్రతాప్‌షాహి ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9154690375లో అందుబాటులో ఉంటారు.
- పోలీస్‌శాఖ పరిశీలకులుగా నియమితులైన అజిత్‌సింగ్ ఎన్నికలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 96549 58832 నంబర్‌లో అందుబాటులో ఉంటారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై వేసవి రద్దీ కనిపిస్తుంది. రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పాటు ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడంతో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది.

వైభవంగా రథోత్సవం



రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

చెన్నకేశవస్వామికి జేజేలు

- భారీ స్థాయిలో తరలివచ్చిన భక్తులు

మాచర్ల : శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు చెన్నకేశవునికి జేజేలు పలికారు. శాస్త్రోక్తంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి రథంపైకి ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు. మండుటెండలో సైతం మధ్యాహ్నం నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చి రథోత్సవం కోసం వేచి వున్నారు. భక్తులు వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు తరలి వచ్చారు. చెన్నకేశవస్వామి రథోత్సవానికి ముందుగా ఆలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, ఈఓ సాంబయ్య, గోపవరపు నాగేశ్వరరావు, సుంకే వాసు ఆధ్వర్యంలో ముందుగా రథోత్సవానికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నేపథ్యంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామివారికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, యువజన రాష్ట్ర నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రథం పై ఉంచే సమయంలో భక్తులంతా స్వామికి జేజేలు పలికారు. స్వామివారి దేవాలయం నుంచి బురుజు సెంటర్ వరకు రథోత్సవం సాగింది. రెండు రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీ చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది తరలిరావడంతో చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి రథోత్సవం జరిగిన ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ శాఖ వారు విద్యుత్‌ను నిలిపివేశారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు, అర్బన్ సీఐ పి శరత్ బాబు పలువురు ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేశారు. ఈ సందర్భంగా రథం లాగేందుకు యువకులు, భక్తులు పోటీపడటంతో రథోత్సవం ఘనంగా జరిగింది.

పీఆర్కే, పీవీఆర్ ప్రత్యేక పూజలు



స్వామి రథోత్సవంలో పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, యువజన రాష్ట్ర నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో మూలవిరాట్‌కు, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రథోత్సవానికి ఉత్సవ విగ్రహాలను అలంకరించి తీసుకొచ్చే సమయంలో వారు చెన్నకేశవస్వామి వారికి జేజేలు పలుకుతూ స్వామి వారిని రథం వద్దకు తీసుకువచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, తురకా కిషోర్, బత్తుల ఏడుకొండలు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి

- ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్
- ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి గ్రామాల్లో ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలబడి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును, తనను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడు, తెల్లబాడు, కంభంపాడు, పమిడిపాడు గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దసంఖ్యలో పార్టీ అభిమానులు, మహిళలు, కార్యకర్తలు భారీ క్రేన్‌ల సాయంతో గజమాలలు వేసి స్వాగతం పలికారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న నవరత్న పథకాలు ప్రతి ఇంట్లో అమలయ్యాయని, ప్రభుత్వం ద్వారా మీరు లబ్ధి పొందితేనే సాయం చేయాలని ధైర్యంగా ఓటు అడుగుతున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు చెప్పారు. 2014–19 వరకు ఐదేళ్ల పాటు ఎవరు సంక్షేమం అందించారో గుర్తించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయడమే కాకుండా ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. టీడీపీకి ఓటేస్తే గుండు సున్నా తప్ప ఏమీ మిగలదని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే చల్లగా ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై రెండు బ్రిడ్జిలు, ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తలార్లపల్లి, నూజెండ్ల రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. సీతారామపురం వద్ద నూతనంగా హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఆశీర్వదిస్తే రానున్న రోజుల్లో వినుకొండ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తాము చేస్తున్న అభివృద్ధి పనులకు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయరామిరెడ్డి, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వంగూరి ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిలా రెంటచింతల

- ఉదయం నుంచే వడగాడ్పులు
- వీధులన్నీ నిర్మానుష్యం

రెంటచింతల: రెంటచింతల నిప్పుల కొలిమిలా మారింది. ఆదివారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 46.3, కనిష్ట ఉష్ణోగ్రత 29.1 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ ఏడాది రెంటచింతలలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. గ్రామంలో కొన్ని రోజులుగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదుకావడంతోపాటు ఉదయం 10 గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతోపాటు ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.



3 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి

జిల్లాలో 17,34,858 మంది ఓటర్లు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 15 వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు నమోదు ప్రక్రియ కొనసాగింది. 18 ఏళ్లు నిండిన యువత తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ఈ సారి జిల్లాలో ఓటర్లు స్వల్పంగా పెరిగారు. ఈ ఏడాది మార్చి 20 ప్రకారం జిల్లాలో 17,20,997 మంది ఓటర్లు ఉండగా ఈనెల 26న విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం 17,34,858 మంది ఓటర్లు ఉన్నారు. 13,861 మంది ఓటర్లు పెరిగారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్లు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెదకూరపాడు	1,13,398	1,19,039	16	2,32,453
చిలకలూరిపేట	1,08,392	1,18,205	49	2,26,646
నరసరావుపేట	1,13,152	1,19,596	30	2,32,778
సత్తెనపల్లి	1,18,400	1,23,635	12	2,42,047
వినుకొండ	1,31,174	1,33,365	20	2,64,559
గురజాల	1,33,353	1,40,576	42	2,73,971
మాచర్ల	1,28,639	1,33,743	22	2,62,404
మొత్తం	8,46,508	8,88,159	191	17,34,858

ఒకటి నుంచి డీబీటీ ద్వారా పింఛన్ల పంపిణీ

- అందని వారికి మూడో తేదీ నుంచి ఇంటి వద్దనే చెల్లింపు
- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట:రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 2,83,665 మంది పింఛన్‌దారులకు రెండు విధాలుగా మే ఒకటో తేదీ నుంచి పింఛన్ పంపిణీ చేయబడుతుందని కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఆదివారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష చేశారు. ఇందులో ఒకటి డీబీటి ద్వారా పింఛన్‌దారులకు వారి ఖాతాలోకి నేరుగా నగదు జమ చేస్తారన్నారు. రెండో విధానం ద్వారా వృద్ధులు, వికలాంగులు, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి, సైనిక వితంతువులకు ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి పంపిణీ చేస్తారన్నారు. మే ఒకటో తేదీ నుంచి డీబీటీ ద్వారా పింఛన్‌దారుల ఖాతాలకు నగదు జమ చేస్తారన్నారు. ఈ విధానం ద్వారా అందని వారికి మే మూడో తేదీన సచివాలయ సిబ్బంది నేరుగా వారి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ చెల్లింపు చేస్తారన్నారు. నగదు కోసం సచివాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. సమాచారం కోసం సచివాలయ కార్యదర్శి, అడ్మిన్, వెల్ఫేర్ అసిస్టెంట్, డీఏలను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రామిరెడ్డి మృతికి ఘన నివాళులు



నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత యన్నం రవీంద్రారెడ్డి తండ్రి యన్నం రామిరెడ్డి (85) కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ గ్రామానికి చేరుకుని రామిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. రవీంద్రారెడ్డిని పరామర్శించారు. ఆయనతో ప్యాక్స్ మాజీ గొట్టిపాటి సాంబశివరావు, మద్దూరి విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ లక్ష్మీ, సింగారెడ్డి కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు తదితరులున్నారు.

35 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు విద్యుత్ ఏడీఏ కార్యాలయం వెనుక భద్రపరిచిన 35 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. వీటిలో 30 త్రీ ఫేజ్, 5 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆదివారం కార్యాలయం ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో ఉన్న ముళ్లకంచెకు నిప్పు పెట్టడంతో భారీ మంటలు చెలరేగి ప్రహరీ గోడకు లోపల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం, పేలుళ్లతో స్థానికులు భయాందోళనకు గురి అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకున్నారు. ఎస్ఈ మురళీకృష్ణయాదవ్, మాచర్ల ఈఈ హరిబాబు, ఏడీ బాబ్జీనాయక్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు రూ 35లక్షలు ఉంటుందని ఎస్ఈ తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పర్యటన

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆదివారం తెలిపారు గడపగడపకు మన పిన్నెల్లి కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. ఉదయం 9గంటలకు శిరిగిరిపాడు, 10గంటలకు మిట్టమీదిపల్లె, 11గంటలకు లోయపల్లి, 1గంటకు గంగలకుంట, 3గంటలకు గొట్టిపాళ్ళ, 5గంటలకు కొత్తపుల్లారెడ్డిగూడెం, రాత్రి 8గంటలకు కండ్లకుంట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



చెరుకుంపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మీ అమూల్యమైన ఓటుతో మరొక్కసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని చెరుకుంపాలెం, చింతపల్లి, పుట్లగూడెం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో గత అయిదేళ్లలో చేసి చూపించామన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలుతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మాదిపాడు వద్ద బ్రిడ్జినిర్మాణపనులు ఎన్నికలు అయిపోగానే మొదలు పెడతామని, అప్పుడు గ్రామాల రూపు రేఖలే మారిపోతాయన్నారు. నియోజకవర్గంలో రూ.27 కోట్లతో వైద్యశాలలు, రూ.83తోట్లతో పాఠశాలలను ఆధునీకరించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అన్ని రకాల సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మర్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వినర్ చిల్కా చంద్రయ్య, తాత్కాలిక ఎంపీపీ గంగసాని నరశింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, డాక్టర్ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ చింతగుంట్ల హనుమంతరెడ్డి, చింతపల్లిలో మాజీ సర్పంచ్ ఇస్సాకు, పుట్లగూడెం సర్పంచ్ తోట పాపారావు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీ, తోట సత్యనారాయణ, సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే బీసీలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంఘాల నాయకులు



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

- బీసీలకు మేలు చేసిన వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి
- స్పష్టం చేసిన బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంఘాల నాయకులు

చిలకలూరిపేట : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 75 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ రంగాల్లో వారి జనాభా ప్రాతిపదికన 50శాతం ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంఘాల నాయకులు చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న బ్యాంకు కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం బీసీ రాష్ట్ర సంఘాల నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌ల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు బీసీలు ఐక్యతగా ఉండి తమకు మేలు చేసే వారికి అండగా నిలవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో రాష్ట్రమంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి బీసీల సత్తాను చాటి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లోనూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పించారని ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. బీసీల్లోనూ సామాన్యులకు సైతం న్యాయం చేసిన నాయకుడన్నారు. మూడు పార్టీల కూటమి అపవిత్రమైనదని జంగం కార్పొరేషన్ చైర్మన్ ప్రసన్న విమర్శించారు. బీసీలకు న్యాయం చేయడంలో వారికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. జయహో బీసీ నినాదం చేస్తూ కల్లబొల్లి మాటలతో బీసీలను మోసం చేయడం తప్ప బీసీలకు చేసిందేమిటో కూటమి నేతలు చెప్పాలన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ బీసీలకు 13 ఫెడరేషన్లు నెలకొల్పి వాటికి చట్టబద్ధత కల్పించిన మహానేత అని శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లలిత్ ప్రజాపతి అన్నారు. వైఎస్ ఆశయాలను, ఆలోచనలను జగన్ వారసత్వంగా తీసుకుని బీసీల్లోని 136 కులాలకు ఏకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అన్ని రాజకీయ విభాగాల్లో 50శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. బీసీలకు అభ్యున్నతికి తోడ్పాటు అందించే పార్టీని విస్మరించి, బీసీలంటే గౌరవం, వారి హక్కుల్ని నెరవేర్చాలన్నా చిత్తశుద్ధి లేని కూటమి చంద్రబాబుకు మద్దతు తెలపడం బాధాకరమని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నందేటి బాబ్జి అన్నారు. బాబుకు ఓటు వేస్తే ముస్లింలకు అధోగతి తప్పదని ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ ఆసిఫాబాబు హెచ్చరించారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ ముస్లింలకు ప్రసాదించిన 4శాతం రిజర్వేషన్‌ను మహా కూటమి నాయకులు తొలిగించే కుట్ర చేస్తున్నారన్నారు. వీరితో ఆ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, ఏపీ టైలర్స్ కార్పొరేటన్ చైర్మన్ ఎస్‌కే సుభాషిణీ, ముదిరాజుల కార్పొరేషన్ డైరెక్టర్ కొండెబోయిన అనూష, బొందిలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బొందిలి శ్రీనివాస్ సింగ్, పార్టీ చిలకలూరిపేట బీసీసెల్ అధ్యక్షుడు నకరికంటి శ్రీకాంత్, ఆలా శివగోపియాదవ్ పాల్గొన్నారు.

వరికెపూడిశెల ఎత్తిపోతల వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్



గండిగనుమల బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, బొల్లా



భారీ గజమాలతో స్వాగతం పలుకున్న ప్రజలు

బొల్లాపల్లి: వరికెపూడిశెల ఎత్తిపోతల పథకం వైఎస్సార్‌సీపీ పాలనతో సాధ్యమని ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని గుట్లపల్లి, కంద్రిక,గంగుపల్లి, గంగుపల్లి తండా, మన్నేపల్లితండా, రావులాపురం, గండిగనుమల గ్రామాల్లో ప్రచార యాత్ర నిర్వహించారు. గ్రామ గ్రామాన ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గండిగనుమల గ్రామంలో జరిగిన బహిరంగ సభలోఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జగనన్న పాలనలోనే కేంద్ర ప్రభుత్వ రిజర్వు ఫారెస్టు అనుమతి తీసుకువచ్చామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఎత్తిపోతల పథక నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో నీటి సమస్య ఉన్నా గత పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. కేవలం ఐదేళ్లలో అనుమతితో పాటు పనులు ప్రారంభించామని, జగనన్నకు మరోసారి అవకాశం కల్పిస్తే ప్రాజెక్టు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కూటమికి, జగనన్నకు జరుగుతున్న పోరులో నమ్మకమనే జగనన్న గెలుపు సునాయాసమని ఆకాంక్షించారు. కూటమి గెలిస్తే పథకాలకు పంగనామాలు పెడతారన్నారు. జగనన్న హయాంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్, గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి సచివాలయానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చేశామన్నారు. వేసవిలో నీటి ఎద్దడికి ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా చేస్తున్నామని, ఈ సారి మండలంలో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకు పట్టాభిషేకం చేద్దాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండో సారి ముఖ్యమంత్రిగా గెలిపించి పట్టాభిషేకం చేద్దామని పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 17వ కౌన్సిలర్ రేపాల రమాదేవి సారథ్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్ద పీట వేస్తూ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించిందని, గురజాలను అభివృద్ధి పథంలో నడిపించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని రెండోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు.2024 ఎన్నికల్లో మేనిఫెస్టో కూడా ప్రజాకర్షణగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం అన్నదాన సత్రం ట్రస్టు సభ్యులు కోడూరి ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు పతంగి అమర్, చీదేళ్ల కృష్ణ, కోతారు నరసింహారావు, ప్రసన్న కుమార్, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ప్యాకేజీ కోసం కులాన్ని తాకట్టు పెట్టిన కృష్ణ మాదిగ

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు



మాట్లాడుతున్న దాసరి సువర్ణరాజు

నరసరావుపేట: ఎన్నికల సమయంలో ప్యాకేజీలకు అమ్ముడుపోయిన కృష్ణమాదిగ తన కులస్తులను మోసం చేస్తూ చంద్రబాబుకి మద్దతు ఇస్తున్నాడని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి సువర్ణరాజు పేర్కొన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని సత్తెనపల్లిరోడ్ వినాయక గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో బీజెపికి మద్దతు ఇచ్చి వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని లక్షలాదిమంది మాదిగలకు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికి వెయ్యి రోజులు గడుస్తున్నా వర్గీకరణ ఊసే లేదన్నారు. ప్రతి ఎన్నికల్లో మాదిగలను మోసం చేస్తున్న చంద్రబాబుకు ఎందుకు మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. 2014 నుంచి 19వరకు ఐదేళ్ల కృష్ణ మాదిగను ఆంధ్రలోకి అడుగుపెట్టనివ్వకుండా చేసిన చంద్రబాబుకు ఈ ఎన్నికలలో మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు సంక్షేమ పరిపాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ ఎమ్మార్పీఎస్ పూర్తిగా మద్దతిస్తుందన్నారు. మాదిగ బిడ్డలు ఇంగ్లీష్ మీడియం చదువుకోటానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లో ఎస్సీలకు సముచిత స్థానం కల్పించి అసెంబ్లీ సీట్లు ఇచ్చిన సీఎం జగన్‌కు పూర్తిగా మద్దతిస్తున్నామన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మేదర సురేష్, పల్నాడు జిల్లా అధ్యక్షులు తలారి నాని పాల్గొన్నారు.

యాదవ బిడ్డను గెలిపించుకోవడం మా బాధ్యత

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగాల సింగరయ్య యాదవ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సింగరయ్య యాదవ్

గురజాల: నరసరావుపేట పార్లమెంట్ పుట్టిన నాటి నుంచి యాదవ బిడ్డకు ఒక్క అవకాశం కూడా రాలేదని ఇప్పుడు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించడంతో ఆయనను గెలిపించుకోవడం తమ బాధ్యతగా అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి జంగాల సింగరయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో ముత్తన బ్రహ్మానందరెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా చేసుకుని తమపై అసభ్యకరంగా మాట్లాడటం టీడీపీ వారికి సరికాదన్నారు. యాదవ బిడ్డ అయిన అనిల్ కుమార్ యాదవ్ గెలుపుకు ప్రతి ఒక్క బీసీ బిడ్డ కృషి చేయాలన్నారు. గంగమ్మ తల్లి సాక్షిగా మేము ఎటువంటి ప్యాకేజీలు తీసుకోలేదని, మేమ ఏ కుటుంబాలను విడదీయలేదన్నారు. లేనిపోని అరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో జంగా ఏసయ్య యాదవ్, జంగా నారాయణ యాదవ్, వై నరసింహారావు యాదవ్; ఎస్ గంగయ్య యాదవ్, జి అంజి యాదవ్ తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కాపు నాయకులు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట : అచ్చంపేటకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కాపు నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వారందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. జనసేన నాయకులంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఆపార్టీ మండలంలో దాదాపు దుకాణం సర్దుకున్నట్లే కనిపిస్తోంది. పార్టీలో చేరిన వారిలో విన్నుకోట కృష్ణారావు, విన్నకోట విజయలక్ష్మీ, వాసా వీరాంజనేయులు, వాసా పద్మ, మలిసెట్టి బుల్లిస్వామి, కొల్లి భార్గవ్, కరిమలి శ్రీను, పద్మ, గోల గాంధి, గోల భారతి, చిమరాల బసరవరాజు ఉన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిక



: కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాచవరం ఎస్సీలు

పిడుగురాళ్ల: మండల కేంద్రమైన మాచవరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాచవరం సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ మద్దు కృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో పేరం రమేష్, లాం బాల ఏసు, కొర్రపాటి లచ్చవకోటి, లాం రమేష్, తాడిగిరి నాగలక్ష్మీ, మోహన్‌సింగ్, పిల్లి బాస్కర్‌రావు, రమేష్‌తోపాటు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాచవరం జెడ్పటీసీ జువ్వెన బోయిన శివయాదవ్, యూత్ అధ్యక్షులు మద్దు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జిలుగు నరసింహారెడ్డి, నరసింహారెడ్డి, రాగిడి శేషుబాబు, బీఆర్ అంబేద్కర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాను మృతి

పిట్టలవానిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ ఆర్మీ జవాను మృతి చెందారు.వివరాలిలా ఉన్నాయి. గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన నాగరాజు (42) ఢిల్లీలో ఆర్మీగా విదులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 25న రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై అలకాపురం వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 26 తెల్లవారు జామున నాగరాజు మృతి చెందినట్లు చందోలు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

పాలిచ్చే ఆవు కావాలా...
ఎగిరితన్నే ఆంబోతు కావాలా

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు

గురజాల: నిత్యం పాలిచ్చే ఆవు లాంటి వైఎస్సార్ సీపీ కావాలో..ఎగిరితన్నే తెలుగుదేశం పార్టీ లాంటి ఆంబోతు కావాలో ఆలోచించుకోవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోగులపాడు, పాత అంబాపురం, పల్లెగుంత గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డికి ప్రజలు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాసు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి వలంటీర్లతో పింఛన్‌లు పంపిణీ చేయకుండా అడ్డుపడ్డారన్నారు. పింఛన్లు తీసుకోవడానికి మండుటెండలో నిలబడి పింఛన్ తీసుకోవాల్సివచ్చిందన్నారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు కారణం చంద్రబాబు అన్నారు. రానున్న కొద్దికాలంలోనే ప్రతి ఇంటికీ కృష్ణమ్మ నీటిని అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీతోనే ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సీసీ రహదారులు నిర్మాణం చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించామన్నారు. గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా, వైద్యశాలల నిర్మాణం వంటివి చేసి పాలన సౌలభ్యం చేశామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), జడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, గోగులపాడు సర్పంచ్ నంద్యాల రాములమ్మ ఎస్ రామిరెడ్డి, రిక్కల వెంకటేశ్వరరెడ్డి, ముత్తన బ్రహ్మానందారెడ్డి, పాశం హనిమిరెడ్డి, వేలమూరి సైదారెడ్డి, దుగ్గిరాల రాజశేఖర్‌రెడ్డి, పాశం పాపిరెడ్డి,వి మల్లయ్య, డి నరేష్, షేక్ నాసర్ సైదా, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, తదితరులున్నారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఎంతో ఉపయుక్తం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ విజయవాడ హైదరాబాద్ క్యాంపస్‌లలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని కేఎల్‌యూ ట్రిపుల్ ఈ కౌన్సెలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.జగదీష్ అన్నారు. ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని, విద్యార్థులకు వచ్చిన ర్యాంకులు, ఇంటర్‌లో వచ్చే మెరిట్ మార్కులు, జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా వారు కోరుకున్న విభాగాన్ని పొందవచ్చని అన్నారు. కేఎల్‌యూ ట్రిపుల్ ఈ ప్రోగ్రామ్‌లలో పలువురు విద్యార్థులకు నూరు శాతం ఫీజు రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి విద్యార్థులు కేఎల్‌యూలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. తమ విద్యాసంస్థలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కేఎల్‌యూ ట్రిపుల్ ఈ 2024 కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం. సుమన్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాల ద్వారా ఫీజుల్లో రాయితీ ఇస్తున్నామన్నారు.